సాగుకు శ్రీరామ రక్ష

- భూసార పరీక్షలతో పంటలకు మేలు
- నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాలను బట్టి ఎరువుల వినియోగం
- పెట్టుబడి ఖర్చు తగ్గి, అధిక దిగుబడులకు అవకాశం



బలభద్రపురంలో మట్టి నమూనా తీస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

బిక్కవోలు: భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువులు వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయి. రైతులకు సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయాధికారులు సిఫారసు మేరకు సిబ్బంది.ఎప్పటికప్పడు రైతులకు సాగు భూమిలో ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చో తెలియజేస్తారు. తద్వారా అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి, భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడ బారడంతో పాటు, చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట కోత పూర్తయిన తర్వాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగు నీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీ మీటర్ల లోతున పారతో గుంత తీసి, పై పార నుంచి కింది వరకూ ఒక్క పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని బాగా కలిపి, అర కేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి, రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపాలి. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగులకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల స్వభావ నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలలకు ఒక నమూనా తీయాలి.

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు, ఆయా నేలల్లో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి, వాటి ఫలితాల ఆధారంగా చేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు, అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	పరీక్ష లక్ష్యం	పరీక్ష చేసినవి	ఇంకా చేయాల్సినవి
అనపర్తి	840	550	290
బిక్కవోలు	920	650	270
రంగంపేట	840	600	240
పెదపూడి	920	850	70
మొత్తం	3,520	2,650	870

భూసార పరీక్షలు ఎంతో మేలు



ఈ పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి, దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలుంటుంది.

– సామ్యూల్ జాన్, వ్యవసాయాధికారి, బిక్కవోలు

క్లుప్తంగా

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పెదపూడి: నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదిత్యునికి ఆదివారం ప్రత్యేక పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామివారికి ఉదయం విశేష వ్రత పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో కుర్చున్నారు. స్వామి వారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన భార్య మహాలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు.

జోరందుకున్న నేరేడు అమ్మకాలు



కోరుకొండలో బండిపై విక్రయిస్తున్న నేరేడు పండ్లు

మధురపూడి: ఆరోగ్య ప్రదాయిని నేరేడు పండ్ల అమ్మకాలు కోరుకొండలో జోరుగా సాగుతున్నాయి. కేజీ ధర సైజును బట్టి రూ.120 నుంచి రూ.200 వరకూ అమ్ముతున్నారు. మండలంలోని నర్సాపురం, గాదరాడ, కణుపూరు. దోసకాయలపల్లి, నిడిగట్ల, బూరుగుపూడి, మధురపూడి, గుమ్ములూరు గ్రామాల్లో వీటి ఉత్పత్తి అధికంగా ఉంది. వర్షాలు ఆలస్యం కావడంతో వీటి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఘనంగా పునీత ఆంథోనీ మహోత్సవం



కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో సందేశమిస్తున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ ఎస్సార్‌నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం సాయంత్రం పునీత ఆంథోనీ మహోత్సవం జరిగింది. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్య సందేశమిచ్చారు. క్రీస్తు వాక్యాన్ని విశ్వవ్యాప్తి చేయడంలో పునీత ఆంథోనీ కృషి అమితమైందన్నారు. భక్తి, నిరాడంబరత, త్యాగం ఆయన ఔన్నత్యమన్నారు. క్రైస్తవులందరూ పునీత ఆంథోనీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు.

గుమ్ములూరు హైస్కూల్‌కు మొక్కల వితరణ



గుమ్ములూరు హైస్కూల్‌కు మొక్కలు అందజేస్తున్న ప్రతినిధులు

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు జెడ్పీ హైస్కూల్‌కు ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు మొక్కలు పంపిణీ చేశారు. గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా 50 మొక్కలను స్కూలు ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారి రూపేష్ మాట్లాడుతూ మొక్కలు మానవ వికాసానికి దోహదపడతాయన్నారు. ప్రాణ వాయువును ఇవ్వడం ద్వారానే ప్రశాంత వాతావరణం ఏర్పడుతోందన్నారు. వీటితో రేపటితరం మానసికోల్లాసంతో పాటు, ఆరోగ్యాన్ని పొందుతుందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో తమవంతు కృషిగా మొక్కలను అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జగదీష్, రామకృష్ణ, రంగబాబు, హెచ్‌ఎం గంగాభవాని, టీచర్లు నాగేశ్వరరావు, జాకబ్‌రాజు పాల్గొన్నారు.

నేడు ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలు ఈ నెల 20న జరగనున్న దృష్ట్యా 17న సోమవారం బ్యాంక్ ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రదర్శించనున్నట్టు బ్యాంక్ ముఖ్య కార్యదర్శి కె.స్వరాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు బ్రాంచీల్లో ఏర్పాటుచేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాలో సభ్యులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 24లోగా లిఖితపూర్వకంగా తెలపాలన్నారు.

ఉపాధి చూపిన మహనీయుడు చింతా



బలభద్రపురంలో పాండురంగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బిక్కవోలు: అనేక మందికి ఉపాధి కల్పించిన మహనీయుడు పారిశ్రామిక వేత్త చింతా పాండురంగారెడ్డి అని రాష్ట్ర కోళ్ల రైతుల సంఘ అధ్యక్షుడు కర్రి వెంకట ముకుంద రెడ్డి కొనియాడారు. ఆదివారం బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిర్డీసాయి ఆలయం వద్ద చింతా పాండురంగారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇటీవల కొమరిపాలెం గ్రామానికి చెందిన చింతా పాండురంగారెడ్డి అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన పారిశ్రామికంగా ఈ ప్రాంతాన్ని విశేషంగా అభివృద్ధి చేసి, ఎంతో మందికి ఉపాధి కల్పించారన్నారు. కొమరిపాలెం గ్రామమే కాకుండా, పందలపాక, తొస్సిపూడి, బలభద్రపురం, రాయవరంతో పాటు, పరిసర గ్రామాల్లో ఎంతో మంది ఉపాధికి బాటలు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం



పుట్టకొండలో కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి కల్యాణం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు పున్నమరాజు కమలాకర్ అధ్వర్యంలో వేద పండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. పది గంటలకు కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటలకు జీలకర్ర, బెల్లం సుమూర్తంతో కల్యాణ తంతు పూర్తి చేశారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు కనులారా స్వామి వారి కల్యాణం తిలకించారు. అనంతరం 12.20కు ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణ మూర్తులతో గ్రామంలో భారీ ఊరేగింపు జరిగింది. ఊరేగింపు మెయిన్ రోడ్డు మీదుగా సాగి, రాత్రి 7 గంటలకు ఆలయానికి చేరుకుంది. అనంతరం స్వామి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ వల్లు సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వర్షంతో నారుమడులకు జీవం



రంగంపేటలోని ఓ నారుమడిలో చేరిన వర్షపు నీరు

రంగంపేట: మెట్టప్రాంత మండలమైన రంగంపేటలో ఇటీవల కురుసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి నారుమడులు నీరులేక ఇబ్బందులు పడుతున్న రైతులు.. నైరుతి రుతుపవనాల రాకతో అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా ఆకు మడుల్లో నీరు చేరడంతో జీవం వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం కూడా చిరుజల్లులు పడ్డాయి. వ్యవసాయ పనులకు ఈ వానలు మేలు చేయడంతో నారు మడులు వేయడానికి, ఇప్పటికే వేసిన ఆకుమడులకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడనుంది. ముఖ్యంగా ఖరీఫ్ పనులకు ఈ వర్షాలు మేలు చేస్తున్నాయి.

కుండపోత వర్షం.. సాగుకు అనుకూలం



బూరుగుపూడిలో కురుస్తున్న వర్షం

మధురపూడి: కోరుకొండ మండలంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఉదయం నుంచి జనం ఎండ తీవ్రతతో ఇబ్బంది పడ్డారు. సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షం సాగుకు అనుకూలంగా మారింది. మెట్ట ప్రాంతంలో దుక్కులు పెరిగాయి. కాగా వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

విత్తన శుద్ధితో పంట సంరక్షణ

- తెగుళ్ల నివారణ, మంచి దిగుబడి
- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు



విత్తన శుద్ధి చేస్తున్న దృశ్యం

రాజానగరం: ప్రస్తుతం రైతాంగమంతా ఖరీఫ్ సాగులో నిమగ్నమయ్యారు. పొలంలో దుక్కులు చేసి, నారు వేసేందుకు మడులు సిద్ధం చేస్తున్న వారు కొందరైతే, బోర్ల సాయంతో ఇప్పటికే ఆ పనులు పూర్తి చేసిన వారు మరికొందరు. ఏ పంటలోనైనా మంచి దిగుబడులు సాధించాలంటే విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, నారుమడి యాజమాన్యం ఎంతో అవసరమంటున్నారు దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు. ఈ కొద్ది పాటి మెళకువలను పాటించడం ద్వారా చాలా వరకు పంటలను ఆశించే వివిధ రకాల తెగుళ్లను నివారించడంతో పాటు, మంచి దిగుబడులను అందుకోవచ్చంటున్నారు.

విత్తన శుద్ధి

- నాణ్యమైన విత్తనాలను ఎంచుకున్నా కానీ, వాటికి విత్తనశుద్ధి చేసుకోవాలి. ఒక కిలో విత్తనాలకు కార్బండిజమ్ 25 శాతం, మాంకోజెబ్ 50 శాతంతో మిశ్రమ శిలీంద్రనాశిని 2 గ్రాముల చొప్పున (2 గ్రా. శిలీంద్ర నాశిని ఒక లీటరు నీటిలో కరిగించి ఒక కిలో విత్తనాలకు పట్టించాలి) నీటిలో నానబెట్టిన విత్తనాలకు విత్తనశుద్ధి చేయాలి.
- అదే పొడి విత్తనం అయితే శిలీంద్ర నాశిని ఒక కిలో విత్తనాలకు 4 గ్రా. లు వాడాలి
- నారు మడిని 10, 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి, చదును చేయాలి.
- ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లే ముందు ఒక కిలో, విత్తిన 12, 14 రోజులకు ఒక కిలో), ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కులో వేయాలి.
- విత్తనశుద్ధి చేసి మొలకలొచ్చిన విత్తనాన్ని సెంటు మడికి 5 కిలోల చొప్పున చల్లాలి.

జింకు లోపం నివారణకు..

- పొలంలో జింకు లోపాన్ని గమనిస్తే 2 గ్రా. జింకు సల్ఫేటు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి,
- విత్తనాలు చల్లిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రా. వేయాలి. లేకుంటే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరీపైరీపాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి, విత్తిన 10, 17 రోజులకు పిచికారీ చేయాలి.
- నారు తయారవడానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి పలుచగా నీరు పెట్టాలి.



డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు

కళ్లెదుటే కలలు తీర్చేది నాన్న



గాడ్ ఫాదర్ పురస్కారాలతో సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: భగవంతుడు కోర్కెలు తీర్చటం మాటేలా ఉన్నా, కళ్లెదుటే కన్నవారి కలలు తీర్చేది మాత్రం నాన్నే అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా సహాయ్ సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో గాడ్ ఫాదర్ పురస్కారాల ప్రదానం జరిగింది. ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షులు దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు కేకే సంజీవరావు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ఈవని యజ్ఞ సూర్యనారాయణశర్మ, సీనియర్ సిటిజన్ వైవీ జగన్నాథరావుకు పురస్కారాలు అందజేశారు. విశిష్ట అతిథులుగా హాజరైన మైలవరపు నాగేంద్రప్రసాద్, అసదుల్లా అహ్మద్, దూర్వాసుల సత్యనారాయణ, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం సత్కరించారు. సమాజంలో తండ్రి పాత్ర వెలకట్టలేనిదని, ఆ నాన్నకు లేఖ పోటీలో ముగ్గురు విజేతలకు బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పీవీఎస్ కృష్ణారావు, మాదిరాజు శ్రీనివాస్, కొత్తపల్లి భాస్కరరామం, సూర్యకుమారి, యేచూరి శ్రీరామచంద్రమూర్తి, ప్రసన్న, రెండుచింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చేరిన మురుగు నీరు



సోమాలమ్మ గుడి వీధిలో రోడ్డుపై ఉన్న మురుగు నీరు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలో సోమాలమ్మ గుడి వీధిలో డ్రైనేజీ పొంగడంతో రోడ్డుపైకి మురుగునీరు చేరింది. రోడ్డుపై వేసిన కల్వర్టు చెత్తతో మూసుకుపోవడంతో మురుగునీరు ముందుకు పారడం లేదు. దీంతో మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ అధికారులు బొమ్మూరు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించలేదు. దీంతో వైఎస్సార్ సీపీ యువ నాయకులు అప్పా రాజీవ్‌కుమార్(బాబి), తోడేటి రాహుల్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి, క్షీరాభిషేకం చేశారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పాబాబీ, రాహుల్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మూరు దళిత నాయకులు జాల కృపారావు, సుధీర్, శ్రీకాంత్, వినిత్, అఖిల్, టోనీ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు

కంబాల చెరువు పార్క్‌లో దుర్గంధం



కంబాల చెరువులో మృతి చెందిన చేపలు

- చేపలు కుళ్లినా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు

రాజమహేంద్రవరం సిటీ: ఆహ్లాదకరమైన కంబాల చెరువు పార్క్‌లో దుర్గంధం వెదజల్లుతున్నా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టడం లేదని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచేందుకు సిద్ధం చేసిన కంబాలచెరువు పార్కులో ఉన్న చెరువులో చేపలు మృతి చెంది, దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని సందర్శకులు మండిపడుతున్నారు. కంబాల చెరువులో వందలాది చేపలు మృతి చెంది, కుళ్లిపోయి, దుర్గంధం వెదజల్లుతోంది. ఆదివారం పార్కుకు వచ్చిన సందర్శకులు ఈ పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్భుతంగా తయారు చేశామని చెప్పే అధికారులు ఈ విధమైన దుర్గంధంలో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నా ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే స్పందించి, చెరువులో మృతి చెందిన చేపలను తొలగించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కంబాల చెరువు పార్క్‌లో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని, దీనిపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.